సాక్షి నిర్మల్

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



ఉత్తరం రాద్దాం.. బహుమతి గెలుద్దాం

8లో▸

ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు తపాలాశాఖ నిర్ణయించింది. లేఖరులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించనుంది.

భైంసా మహిళకు బహుమతి

భైంసాటౌన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ బహుమతులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో లక్కీడ్రా తీసి మంగళవారం విజేతలను ఎంపిక చేశారు. ఇందులో భైంసా డిపో నుంచి సొట్టేవార్ లక్ష్మి మొదటి బహుమతి గెలుచుకుంది. ఆర్ఎం సొలోమాన్‌రాజ్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎం అమృత ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన శ్రీహరిరావు



మురళీధరన్‌తో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌ను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. నిర్మల్ జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఈ సందర్భంగా శ్రీహరిరావుకు మురళీధరన్ సూచించారు.

కడెం పర్యటనలో ట్రెయినీ ఎఫ్‌బీవోలు



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో అనిత

కడెం: దూలపల్లి అటవీ శిక్షణ అకాడమీకి చెందిన 34 మంది ట్రెయినీ ఎఫ్‌బీవోలు మంగళవారం కడెం మండలంలో పర్యటించారు. మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తుల కోసం చేపట్టిన పునరావాస కాలనీ పనులు పరిశీలించారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణపై ఎఫ్ఆర్వో అనిత శిక్షణ ఎఫ్‌బీవోలకు అవగాహన కల్పించారు. అటవీ సిబ్బంది ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారిణి ప్రతిభ



శ్రీవల్లి

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లో ఈ నెల 1నుంచి 4వ తేదీ వరకు చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా క్రీడాకారిణి అనుముల శ్రీవల్లి రాష్ట్రస్థాయిలో మిక్స్‌డ్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్, నిర్మల్ సహ కార్యదర్శి వన్నెల భూమన్న, నిర్మల్ అధ్యక్షుడు ఆమెడ కిషన్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.


'బీఎస్పీతోనే రాజ్యాధికారం'



మాట్లాడుతున్న జగన్‌మోహన్

నిర్మల్‌టౌన్: బహుజన సమాజ్ పార్టీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 53 శాతం ఉన్న బీసీలకు 22 సీట్లు మాత్రమే బీఆర్ఎస్ కేటాయించిందని, కాంగ్రెస్, బీజేపీలు కూడా బీసీలను మోసం చేస్తాయన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ వచ్చే ఎన్నికల్లో బీసీలకు 70 సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. బీఎస్పీ నాయకులు రాజన్న, లక్ష్మి, గణేశ్, గంగామణి, విజయ్, సునీత ఉన్నారు.


మామిడి మొక్కల పంపిణీ



మొక్క నాటుతున్న వెంకన్న తదితరులు

పెంబి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ మట్ట వెంకన్న మంగళవారం పెంబి, మందపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులకు ఉచితంగా మామిడి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు రామేశ్వర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, గోవింద్, రవి, శంకర్, ఇందు, చిన్నయ్య, పెంబి యువ రైతులున్నారు.

కదిలిన రైలు..!



- జిల్లా మీదుగా పట్నందాకా లైన్
- కేంద్రమంత్రి ప్రకటనతో తెరపైకి..
- తమ కృపేనంటున్న బీఆర్ఎస్
- తామే నిర్మిస్తామంటున్న బీజేపీ
- రైలొచ్చేనా..! అంటున్న ప్రజలు
- ఆవశ్యకతపై 'సాక్షి' పలు కథనాలు



రైల్వేలైన్‌పై 'సాక్షి' ప్రచురించిన కథనాలు



నిర్మల్: 'మనమెక్కిన రైలు.. జీవితకాలం లేటు..' అన్న నానుడి నిర్మల్‌కు రైలు.. అనే మాటకు పక్కాగా సరిపోతుంది. ఇప్పుడా.. అప్పుడా.. దశాబ్దాల కిందట రేడియోల్లో కేంద్ర రైల్వే బడ్జెట్ ప్రసంగం వింటున్నప్పుడు.. 'హైదరాబాద్ సే ఆదిలాబాద్ తక్ నయా రైల్వేలైన్‌కేలియే సర్వే కరేంగే..' అంటూ రాగానే నిర్మల్‌వాసులంతా సంబురపడేవాళ్లు. అలా ప్రతీఏడాది ఇలా వినడమే సరిపోయింది. సర్వేల మీద సర్వేలు చేస్తూనే పోయారు. తరాలు గడిచిపోయాయే గాని.. అడుగుముందుకు పడలేదు. చివరకు ఈ ప్రాంతం రైల్వేలైన్ ముచ్చటే మరిచిపోయింది. ఆరేళ్లక్రితం సీఎం కేసీఆర్ ఇచ్చిన లెటర్‌తో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి మంత్రి జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్ కేంద్ర రైల్వేమంత్రిని కలిశారు. దాంతో మళ్లీ రైల్వేలైన్‌పై ఆశలు మొలకెత్తాయి. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్రాల జాయింట్ వెంచర్‌గా నిర్మాణం చేపడతామన్న రైలుమార్గం ఇప్పటికీ ఎటూ తేలలేదు. తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటనతో జిల్లాలో మళ్లీ రైలు చర్చ మొదలైంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ 'కూత' పెరుగుతోంది. రైలుపట్టాల్లా ఉన్న బీజేపీ–బీఆర్ఎస్ మధ్య రైల్వేలైన్ విషయంలో మాటల యుద్ధమూ రగులుతోంది. మరోవైపు.. ఇప్పటికైనా నిర్మల్ మీదుగా రైలు వస్తుందా.. అన్న సందేహం జిల్లావాసుల్లో మాత్రం అలాగే ఉంది.

దశాబ్దాలుగా నిరీక్షణ..

హైదరాబాద్–ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దశాబ్దాలుగా నలుగుతోంది. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో.. తెలంగాణ ఏర్పడి మంత్రి అయ్యాక రైల్వేలైన్ కోసం తనవంతు ప్రయత్నం చేశారు. కేంద్ర మంత్రిగా చేసిన వేణుగోపాలాచారి, ఆ తర్వాతి ఎంపీలూ కొంతమేర ప్రయత్నం చేశారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా కేవలం సర్వేలతోనే కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సరిపెట్టాయి. ఇక్కడ లైన్ నిర్మిస్తే రైల్వేశాఖకు పెద్దగా లాభం లేదంటూ చేసిన సర్వేలు పక్కనపడేశాయి.

'జాయింట్' కాని మార్గం..

2017నుంచి ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నా కేంద్ర, రాష్ట్రాల మధ్య నూతన రైల్వేలైన్ నిర్మాణం విషయంలో ముందడుగు పడలేదు. సర్వేలను మాత్రం పూర్తిచేస్తూ వస్తున్నారు. మరోవైపు రూ.1,200కోట్ల నుంచి ఏడాదికేడాది ప్రతిపాదిత రైల్వేలైన్ నిర్మాణవ్యయం రెట్టింపవుతూ వస్తోంది. పలు సందర్భాల్లో రాష్ట్రమంత్రి అల్లోల, ఎంపీ సోయం బాపూరావు రైల్వే అధికారులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. కానీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంవోయూ (మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్)కు ముందుకు రాకపోవడంతో పెండింగ్‌లోనే ఉండిపోయింది.

తాజాగా తెరపైకి..

కలగానే మిగిలిన రైల్వేలైన్‌పై ఎన్నికల వేళ మళ్లీ కదలిక మొదలైంది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదివారం పలు రైల్వేమార్గాలపై మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706కోట్లతో లైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మూడుదశాబ్దాల క్రితం ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు రైల్వేలైన్ ప్రతిపాదన ఉంది. ఆ మార్గాన్నే మారుస్తూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా ప్రతిపాదనలో ఉన్నట్లు పేర్కొన్నారు. జాయింట్‌వెంచర్‌గా కాకుండా కేంద్రమే ప్రతిపాదిస్తుండటంతో జిల్లావాసుల్లో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి. కానీ.. గతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో రైలు వచ్చేదాకా తమ కల సాకారం అవుతుందన్న నమ్మకం లేదంటున్నారు. మరోవైపు లైన్ నిర్మాణమైతే ఆ ఘనత తమదేనంటూ బీఆర్ఎస్, బీజేపీ మధ్య సోషల్‌వార్ ప్రారంభమైంది.

ఆరేళ్లక్రితం.. 'సాక్షి' కథనం..

తెలంగాణ ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై పెద్దపల్లి–జగిత్యాల–ఆర్మూర్–నిజామాబాద్ రైల్వేలైన్ పూర్తయ్యింది. ఇదేక్రమంలో నిర్మల్ లైన్ తెరపైకి వచ్చింది. పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంలో తక్కువ దూరంతో ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ వేయొచ్చన్న విషయం తెరపైకి వచ్చింది. 2016 డిసెంబర్ 26న 'సాక్షి' జిల్లా టాబ్లాయిడ్‌లో 'రైలు రాక కలేనా..?' శీర్షికన కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ఈ మార్గం అవశ్యకతను వివరించింది. ఇదే క్రమంలో 2017 జనవరి 24న ప్రస్తుత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అప్పటి మంత్రి, ప్రస్తుత ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, అప్పటి ఎంపీ నగేశ్ కలిసి ఢిల్లీ వెళ్లారు. అప్పుడు ఉన్న కేంద్ర రైల్వే మంత్రి సురేశ్‌ప్రభును కలిసి ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్‌ను జాయింట్ వెంచర్‌గా నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందంటూ సీఎం కేసీఆర్ ఇచ్చిన లేఖను ఆయనకు అందించారు. దీంతో అదే ఏడాది ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఈ నూతన ప్రతిపాదిత మార్గాన్ని జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు సుముఖత వ్యక్తంచేస్తూ, సర్వేకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

'కేంద్రం నిధులతోనే రైల్వేలైన్'



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వమే వందశాతం నిధులతో నిర్మల్ మీదుగా రైల్వేలైన్ నిర్మాణం చేపడుతోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం మినహా రైల్వేలైన్‌కోసం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న కోటాను ఇవ్వకపోగా, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. జిల్లాలో దళితబంధు రాని దళిత కుటుంబాలతో ఈనెల 12న 48గంటల నిరాహారదీక్ష చేపడతానని స్పష్టం చేశారు. వచ్చేనెలలో నిర్మల్‌కు ప్రధాని మోదీ నిర్మల్‌కు రానున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు అయ్యన్నగారి భూమయ్య, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్, అయ్యన్నగారి రాజేందర్, సిరిగాది విలాస్, ముత్యంరెడ్డి, అలివేలు మంగ, కమల్ నయన్, వొడిసెల అర్జున్, రామోజీ నరేశ్, అల్లం భాస్కర్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షెహజాది

నిర్మల్‌చైన్‌గేట్: మైనార్టీల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని మైనార్టీ కమిషన్ జాతీయ సభ్యుడు సయ్యద్ షెహజాది సూచించారు. మైనార్టీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి శాఖల వారీగా మైనార్టీలకు అందుతున్న ప్రయోజనాలపై సమీక్షించారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శించకుండా అర్హులకే అండగా నిలువాలని కోరారు. జిల్లాలో మైనార్టీల సంక్షేమానికి 15 నూతన సూత్రాల కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన మైనారిటీలకు వందశాతం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మేరు కులస్తులను ఆదుకుంటాం

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- 100 కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: జిల్లాలోని మేరు కులస్తులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కనకాపూర్ గ్రామంలోగల కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా మేరు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కనకాపూర్ గ్రామానికి చెందిన పూసపత్రి సత్యనారాయణను అభినందించారు. రూ.6లక్షల సొంత నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన 100 కుట్టు మిషన్లను మంత్రి పంపిణీ చేశారు. త్వరలో మరో 200 మిషన్లు అందజేస్తానని హామీ ఇచ్చారు. మేరు కులస్తుల అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎర్ర రఘునందన్‌రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, ఓస రాజేశ్వర్, సుక్కు రాజవ్వ, మేకల రాజేందర్‌యాదవ్, సల్లా రాజేంద్రప్రసాద్, కోండ్ర నరేశ్‌రెడ్డి, మేరు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సారంగపూర్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సులభమని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంతోపాటు, మలక్‌చించోలి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారంగాపూర్ సర్పంచ్ సుజాత–నర్సారెడ్డి రూ.లక్షా 30వేలు సొంతంగా వెచ్చించి 16పాత కెమెరాలకు మరమ్మతు, నాలుగు కొత్త కెమెరాలను ఏర్పాటు చేయించడం హర్షణీయమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల మరమ్మతుకు స్థానికుడు మండాజి అరుణ్ రూ.10వేల ఆర్థికసాయం అందజేయగా డీఎస్పీ ఈ సందర్భంగా అతడితోపాటు సర్పంచ్‌ను సన్మానించారు. మలక్‌చించోలిలో వీడీసీ సభ్యులు ఏర్పాటు చేయించిన 15 సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించి వీడీసీ సభ్యులను సత్కరించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, మలక్‌చించోలి సర్పంచ్ దశరథ భోజరాజు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లన్న, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వార్షిక తనిఖీల్లో భాగంగా సారంగపూర్ పోలీస్టేషన్‌ను డీఎస్పీ గంగారెడ్డి తనిఖీ చేశారు. ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు, ఎఫ్ఐఆర్‌లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈయన వెంట రూరల్ సీఐ, స్థానిక ఎస్సై ఉన్నారు.

'మహా' పోలీసులతో డీఎస్పీ సమావేశం



మహారాష్ట్ర పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ

సారంగపూర్: ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సరిహద్దు జిల్లా పోలీస్ అధికారులతో మంగళవారం డీఎస్పీ గంగారెడ్డి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ సరిహద్దులోగల నాందేడ్, ఇస్లాపూర్ పోలీస్‌స్టేషన్లలో సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేసేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. మద్యం, నగదు సరఫరా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీ తనిఖీలు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించామని డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఇస్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ భోస్లే, ఎస్సైలు కామాదే, కోర్కె, సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తదితరులున్నారు.

మెగా డీఎస్సీ వేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మెగా డీఎస్సీ వేసి రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్, డీఈవోకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6,612 పోస్టుల భర్తీకి వేసిన నోటిఫికేషన్‌ను రద్దుచేసి నూతనంగా 24వేల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీ నవీన్, నాయకులు రాజారాం, గంగరాజు, డీఎస్సీ అభ్యర్థులు తిరుమలేశ్, సురేశ్, శ్రావ్య, వరం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దాల్ మిల్లు పరిశీలన

పెంబి: ఇంద్రవెల్లి, ఉట్నూర్ గిరిజన ఉత్పత్తిదారుల సంస్థలు, ప్రజామిత్ర ట్రైబల్ ఎఫ్‌పీవో నిర్వహిస్తున్న సహకార దాల్ మిల్లు, ఇంద్రవెల్లి ట్రైబల్ ఎఫ్‌పీవో నడిపిస్తున్న సహకార జిన్నింగ్ మిల్లులను వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో పెంబి ట్రైబల్ రైతు ఉత్పత్తి దారుల సంస్థ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రజామిత్ర సొసైటీ డైరెక్టర్ విఠల్‌రావు పత్తి ఆన్‌లైన్‌లో అమ్ముకునే విధానంపై అవగాహన కల్పించారు. ఏఈవో రాజ్‌కుమార్, ట్రైబల్ ఎఫ్‌పీవో సభ్యులు టీకాజీ, జైహింద్‌రెడ్డి, దేవుజీ, గంగాధర్, స్వామి, రవి, బాలాజీ తదితరులున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నది వీరే..



సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నారాయణవర్మ

మామడ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల ప్రిన్సిపాల్ గంగాశంకర్, జెడ్పీఎస్ఎస్ మంజులాపూర్ పీజీ హెచ్ఎం సిద్ధ పద్మ, మామడ మండలం కొరిటికల్ జెడ్పీఎస్ఎస్ ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు నారాయణవర్మ, కడెం పెద్దూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అవార్డులు స్వీకరించారు.



అవార్డు అందుకుంటున్న గంగాశంకర్



సిద్ధ పద్మ



వెంకటేశ్వర్లు

ఘనంగా గురుపూజ మహోత్సవం



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి
చిత్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన గురుపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి అవార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 260 పాఠశాలల్లో 'మన ఊరు–మనబడి' కింద అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈనెల 15న జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నిర్మల్, సారంగపూర్ ఎంపీపీలు రామేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

భైంసాటౌన్‌: ఎగువన కురుస్తున్న వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద నీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి ఎప్పటికప్పుడు నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.6 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం 8600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అంతేమొత్తంలో వదిలారు.

రికార్డు అసిస్టెంట్‌కు సన్మానం



నరేందర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

భైంసా: ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ పరిశోధన స్థానం, ముధోల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ రాష్ట్ర వ్యాప్త ఉత్తమ అవార్డుకు ఎంపిక య్యాడు. దీనిని పురస్కరించుకుని మంగళవారం అతడిని ఎంపీటీసీ పోతన్నయాదవ్, ముధోల్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ నర్సయ్య, హెడ్ డాక్టర్ విజయ్, ఆఫీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్సై రవికుమార్

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తండాకు చెందిన ఇస్లావత్ మేనాబాయి వద్ద నుంచి ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం గుడుంబా తయారీని అరికట్టేందుకు తండావాసులకు అవగాహన కల్పించారు. ఇందులో ఏఎస్సై భీంరావు, ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, వెంకటేశ్, భాస్కర్, నీరోషా ఉన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



బుచ్చన్న (ఫైల్)

పెంబి: వీఆర్‌ఏలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే.. పెంబి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించిన ఇటిక్యాల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఆయిండ్ల బుచ్చన్న సర్దుబాటులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో రికార్డు అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. విధుల్లో చేరిన నాటి నుంచి దివ్యాంగుడైన బుచ్చన్న ఇంత దూరం బదిలీ చేశారని మనోవేదనకు గురికావడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో 15 రోజుల క్రితం నిజామాబాద్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. బీపీ ఎక్కువ కావడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు.

ఉత్తరం రాద్దాం.. బహుమతి గెలుద్దాం

- లేఖ రచనను ప్రోత్సహించేందుకు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు
- విజేతలకు నగదు బహుమతులు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా తపాలాశాఖ



నిర్మల్‌చైన్‌గేట్/నేరడిగొండ: నేటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, ఈ–మెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. ఐదు దశాబ్దాల ముందుకు వెళ్తే ఉత్తర ప్రత్యుత్తరాలు కేవలం లేఖల ద్వారానే జరిగాయి. దూరప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారాన్ని ఉత్తరం, టెలిఫోన్, టెలిగ్రామ్ ద్వారా తెలుసుకునే పరిస్థితి ఉండేది. సెల్‌ఫోన్ వినియోగం .. ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వాడకం తర్వాత సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చిందని చెప్పవచ్చు. నేటి తరానికి ఇంచుమించుగా ఉత్తరం అంటే తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు, తెలిసిన వారికి మరోసారి గుర్తు చేసేందుకు తపాలాశాఖ నడుం బిగించింది. లేఖరులకు పోటీ పెడుతోంది.

'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా'...

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపరు తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కానరాదు. మొబైల్ ఫోన్ ద్వారా సమస్త సమాచారాన్ని క్షణాల్లో వివిధ మార్గాల్లో చేరవేస్తున్నారు. ఫోన్ లోనే ప్రత్యక్షంగా వాయిస్ కాల్, వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకునే పరిస్థితి ఉంది. ఖండాంతరాల్లో ఉన్న వారితో సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే పరిస్థితి ఉండడంతో లేఖల ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలు మర్చిపోయిన పరిస్థితి ఉంది. ఒకప్పటి సమాచార సాధనమైన ఉత్తరాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలా శాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో 'ధాయి ఆఖర్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

రెండు విభాగాల్లో..

ఈ పోటీల్లో భారతదేశ పౌరులు పాల్గొనవచ్చు. 18 ఏళ్ల లోపు వారికి ఒక కేటగిరీ, ఆపై వారిని మరో కేటగిరీగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చారు. ఎ4 సైజ్ పేపరుపై రాసి ఎన్వలప్ కవర్‌లో పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్స్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. వ్యాసం చేతితో మాత్రమే రాసి పంపించాలి. లేఖలు పంపించే వారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయస్సు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను ఎస్‌పీవోఎస్, ఆదిలాబాద్ డివిజన్ చిరునామాకు అక్టోబరు 31లోగా పంపించాలి.

బహుమతులు ఇలా..

రెండు కేటగిరీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 12 మందికి మించకుండా ప్రథమ రూ.25 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సదవకాశం. వయసుతో పనిలేకుండా ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరితో వ్యాసం రాసి పోస్ట్ చేయాలి.

– ఎస్.అనిల్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాలా శాఖ పర్యవేక్షకులు

ఐకమత్యంతో పనిచేస్తే ఆర్థికాభివృద్ధి



వివరాలు తెలుసుకుంటున్న సుశీల

ఉట్నూర్‌రూరల్‌: ఐకమత్యంతో పనిచేస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని నాబార్డ్ సీజీఎం సుశీల చింతల అన్నారు. మంగళవారం మండలంలోని రాజన్నగూడలో యూఎన్‌ఆర్‌ఎఫ్‌పీసీఎల్ గోదాం, కస్టం హైరింగ్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంఘాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడవడం అభినందనీయమన్నారు. మారుమూల గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. రైతు సంఘాన్ని అభినందించారు. రానున్న రోజుల్లో ఇలాగే సంఘాలుగా ఏర్పడి ఒకరికొకరు తోడుగా ఉంటూ.. మరింతగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అధికారులు, ధాన్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిలేశ్ రాథోడ్, జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వంట కుక్కర్లు సీజ్



గోదాములో కుక్కర్లను పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఆదిలాబాద్‌టౌన్‌: కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డికి సంబంధించిన వంట కుక్కర్లను కమర్షియల్ ట్యాక్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలోని ఓ గోదాంలో కుక్కర్ల డంప్‌ను పోలీసులు గుర్తించారు. వారికి వచ్చిన సమాచారం మేరకు అక్రమంగా ఏదో నిల్వ ఉంచారని సమాచారం ఆవడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లారు. గోదాములో దాదాపు 2వేలకు పైగా వంట కుక్కర్లు ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఈ విషయాన్ని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు తెలియజేశారు. దీంతో వారు అక్కడికి చేరుకొని జీఎస్టీ బిల్లు ఉందో.. లేదోననే విషయాలపై ఆరా తీశారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను అడగగా, గోదాములో అక్రమంగా ఏదో నిల్వ ఉంచారని వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లడం జరిగిందని తెలిపారు.

ఓటమి భయంతోనే చిల్లర రాజకీయం

- కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్‌: ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరుపేద మహిళలకు అందిస్తున్న ప్రెషర్ కుక్కర్‌ల పంపిణీని అడ్డుకోవాలని చూడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన, ఆదరణ చూసి ఓర్వలేక అధికారాన్ని అడ్డం పెట్టుకొని పోలీసుల చేత కుక్కర్‌లు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేయడం సరికాదని మండిపడ్డారు. 24 గంటల్లోగా సీజ్ తొలగించాలని లేదంటే మహిళలతో ఎమ్మెల్యే జోగు రామన్న ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ ప్రాంత వాసులకు పౌష్టికాహారం అందాలని ఉద్దేశంతో ప్రెషర్ కుక్కర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎంతోమంది అభాగ్యులకు బాసటగా నిలుస్తున్నామని తమ కార్యక్రమాలను అడ్డుకున్న వారికి మహిళలు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

వెంకూర్‌లో తోడేలు కలకలం..!

- ఎద్దు, యువకుడిపై దాడి

కుంటాల: మండలంలోని పాత వెంకూర్ శివారులోని వాగు సమీపంలో మంగళవారం యువకుడినూ, ఎద్దుపై దాడి చేసింది. స్థానికుల వివరాల మేరకు... వెంకూర్ గ్రామానికి చెందిన రేకుల బద్రి, అతడి బావమర్ది శివతో కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని పశువులను మేపుతున్నాడు. ఒకసారిగా తోడేలు బద్రిపై దాడిచేసింది. దీంతో అతడు చేతులతో పక్కకు పడేశాడు. దీంతో అక్కడే ఉన్న ఎద్దుపై దాడికి పాల్పడింది. దీంతో బద్రి, శివ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయింది. కుటుంబ సభ్యులు బద్రిని స్థానిక వైద్యశాలకు తరలించగా.. అవసరమైన మందులు లేకపోవడంతో నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఆర్వో రేష్మ, ఎఫ్‌బీవో స్రవంతి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తోడేలు పాదముద్రలుగా అధికారులు గుర్తించారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



గంగాధర్(ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం నసీరాబాద్‌లో మల్లెల గ్రామానికి చెందిన రైతు అప్పుల బాధతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన మల్లెల గంగాధర్ (37) తనకున్న ఎకరం భూమితో మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంటపెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేనని మనస్తాపానికి గురై చేనులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. భార్య సత్తెవ్వ ఆరా తీయగా పురుగుల మందుతాగినట్లు చెప్పాడు. వెంటనే 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మంగళవారం అతడి భార్య మల్లెల సత్తెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. అతడికి ఇద్దరు కుమారులు యువరాజ్, మణికంఠ ఉన్నారు. అయితే 2021, అక్టోబర్‌లో గంగాధర్ భార్య మెడలోంచి పల్సర్ బైకుపై వచ్చి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెల్లాడు. అదికూడా అప్పుల బాధకు మరో కారణంగా తెలుస్తుంది.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

- మూడ్రోజులుగా మృతదేహం మార్చురీలోనే

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలో అనుమానాస్పదస్థితిలో మహిళ మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన వందన(23) స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తుంది. దీంతో తండ్రి నిర్మల్‌లో అద్దె రూం తీసుకుని నివాసం ఉంచాడు. అదే బుగ్గారం సర్పంచ్ సుభాష్, వందన నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. 15 జనవరి 2023న నిర్మల్‌లోని ఓ గుడిలో తల్లీదండ్రులకు తెలువకుండా పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన 15రోజులకు వందనను ఇంటికి పంపించి మీ తల్లిదండ్రులతో నేను వచ్చి మాట్లాడుతానని చెప్పాడు. అప్పటి నుంచి ఎన్ని రోజులైనా రాకపోవడంతో గత జూన్ నెలలో పెళ్లైన విషయాన్ని తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు తెలిపింది. దీంతో సుభాష్ గ్రామం నుంచి పారిపోయాడు. మళ్లీ తిరిగి జూన్‌లో రావడంతో గ్రామ పెద్దలు సుభాష్‌ను ఒప్పించారు. ఆ తర్వాత మళ్లీ నిర్మల్‌కి వచ్చి అద్దె రూంలో నివాసముంటున్నారు. కొన్నిరోజుల తరువాత వేధింపులకు గురి చేయడంతో ఈ నెల 2వ తేదీన వందన గుర్తు తెలియని పురుగుల మందుతాగింది. దీంతో భర్త స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స అనంతరం తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి తీసుకెళ్లాడు. మళ్లీ అర్ధరాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కొంత సేపటికి వందన మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తన కూతురు మరణానికి సుభాష్‌తో పాటు మరో నలుగురు కారణమని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు. అయినా తల్లిదండ్రులు మొత్తం ఐదుగురిని అరెస్టు చేసేంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలోనే కూతురి మృతదేహాన్ని ఉంచుతామని, తీసుకెళ్లేది లేదని పోలీసులకు తెలిపారు. మూడు రోజులుగా మృతదేహం ఆస్పత్రి మార్చురీలోనే ఉంది.

మానవ అక్రమ రవాణా నియంత్రణ అందరి బాధ్యత

- సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ

ఎదులాపురం: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మావల రైతు వేదికలో మంగళవారం మనుషుల అక్రమ రవాణా నిరోధంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే 3వ అతి పెద్ద నేరంగా పరిగణించడుతోందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది మహిళలు, అమ్మాయిల అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి, మారుమూల గ్రామాల యువతులను ఉద్యోగం, సినిమా అవకాశాలు, డబ్బు ఆశ చూపి మభ్యపెట్టి తీసుకెళ్లి వ్యభిచార గృహాలకు అమ్ముతున్నారని, అక్కడ వారు అనేక బాధలను అనుభవించి దుర్భర స్థితిలో మృత్యువాత పడుతున్నారన్నారు. దీనిపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా 27 ఏళ్లుగా పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యాశాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 28200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సూపర్‌వైజర్ జయశ్రీ, ఫర్హా, విజయ, లక్ష్మి, రూపావతి పాల్గొన్నారు.

ఉచిత విద్య, ఉద్యోగావకాశాలు వినియోగించుకోవాలి

ఉట్నూర్‌రూరల్‌: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని టెన్త్, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 8న శుక్రవారం ఉదయం 9గంటలకు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రంలో ఎంపిక ఉంటుందని ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఉద్యోగ అవకాశం, ఉచిత విద్యలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు వయస్సు 17–20 సంవత్సరాల మధ్య ఉండి పదో తరగతిలో 60 శాతం, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ లేదా ఒకేషనల్‌కోర్స్ 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా గిరిజన నిరుద్యోగ యువతి యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకై 9493535052 సంప్రదించాలని కోరారు.

11న జాతీయ అప్రెంటిషిప్ మేళా

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈనెల 11న జాతీయ అప్రంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు www.apprenticeshipindia.gov.in/m ela& Registation ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మేళాకు రిజిస్ట్రేషన్ కాఫీ, ఆధార్‌కార్డు, ఎస్‌ఎస్‌సీ మెమో, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఈ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటాయని ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో స్టైఫండ్‌ను నేరుగా అభ్యర్థుల అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు శిక్షణ అధికారి శ్రీనివాస్‌ను కళాశాల పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు.

సాహసోపేతంగా మరమ్మతులు



స్తంభంపై మరమ్మతులు చేస్తున్న నర్సయ్య

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ సరఫరా సోమవారం నిలిచిపోయింది. చెరువు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో నిన్న రాత్రి మరమ్మతులు చేయలేకపోయారు. మంగళవారం ఉదయం జేఎల్‌ఎం నర్సయ్య సాహసోపేతంగా చెరువులో ఈదుకుంటు వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు పూర్తి చేయడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జేఎల్‌ఎం సాహసాన్ని ఏఈ సుమన్, అధికారులు అభినందించారు.

ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్‌: ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉట్నూర్ కుమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీలను ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మొత్తం 76మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులతో సత్కరించారు. గిరిజన ఆశ్రమ విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు నూతన అంశాలపై ఉత్సాహం చూపిస్తారని వారి స్థాయికి అనుగుణంగా బోధించాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రులతో కాకుండా ఎక్కువ కాలం గడిపే ప్రదేశం పాఠశాల అని పాఠశాల వాతావరణం విద్యార్థికి ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏటీడీవోలు, ఏసీఎంవోలు ఉన్నారు.

జిల్లాలో విధులు నిర్వర్తించడం సంతృప్తినిచ్చింది



జాబితా బోర్డులో తన పేరును చూసి మురిసిపోతున్న ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి

ఆదిలాబాద్‌: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా నిర్వర్తించడం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఖజానా శాఖ, రెవెన్యూ విభాగాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌తో గతంలో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. జిల్లాలో విధులు నిర్వహించిన కలెక్టర్ల జాబితా బోర్డులో తన పేరును చూసి మురిసిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి 2002 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులను నిర్వర్తించడం మర్చిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. గతంలో ఫైళ్లను మాన్యువల్‌గా నిర్వహించడం జరిగేదని, ప్రస్తుతం ఈ–ఆఫీస్ వంటి ఆన్‌లైన్ విధానం ద్వారా త్వరితగతిన ప్రజల సమస్యల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఓటర్ నమోదు ప్రోత్సహించేలా పోస్టర్, షార్ట్ వీడియో చాలెంజ్‌కు సంబంధించిన ఎన్నికల కమిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ఖుష్బూ గుప్త, శ్యామలాదేవి, అసిస్టెంట్, ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవో స్రవంతి డీటీవో హారిక, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసాటౌన్‌: అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో జరిగే నేరాల నియంత్రణకు ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో కలిసి పని చేయాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని ధర్మాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తానూర్, బాసర ఎస్సైలు, ముధోల్ సీఐతో పాటు ధర్మాబాద్ డీఎస్పీ ప్రశాంత్‌సింపత్, ఎస్సై షిండేతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశీదారు అక్రమ రవాణా, ఆస్తి నేరాలు, మోడ్ ఆఫ్ ఆపరెండి నేరస్తులు, నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నవారు, గుర్తు తెలియని మృతదేహాలు, మిస్సింగ్ కేసులు, తదితర అంశాలపై చర్చించారు. అలాగే అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై చర్చించారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా



పోలీస్ అధికారులతో చర్చిస్తున్న సీఐ నైలు

కుంటాల: మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని భైంసా గ్రామీణ సీఐ నైలు పేర్కొన్నారు. ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకాలోని ఇస్లాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. మహారాష్ట్ర- తెలంగాణ పోలీసుల సమష్టి కృషితో నేరాల అదుపునకు కృషి చేయాలని కోరారు. అక్రమ మద్యం, గుడుంబా, గంజాయి, మారకద్రవ్యాల రవాణా జరగకుండా చర్యలు తీసుకుందామని పేర్కొన్నారు. నేరాస్తుల జాబితా, మావోయిస్టుల కదలికపై చర్చించారు. ఇస్లాపూర్ అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బోస్లే ఉమేష్, కుంటాల, కుభీర్ ఎస్సైలు హన్మాండ్లు, షరీఫ్, పీఎస్సై కోర్కె తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా సతీశ్



నియామక పత్రం ఇస్తున్న నాయకులు

కడెం: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన పొద్దుటూరి సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ రావు, అమీర్‌జావిద్, జిల్లా ఇన్‌చార్జి ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

కుంటాల: కుంటాల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించాల్సి ఉండగా..కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

మైనార్టీలకు చెక్కుల పంపిణీ

లోకేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నలుగురు మైనార్టీలకు రూ.లక్ష చొప్పున జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ చెక్కులు పంపిణీ చేశారు. మన్మద్‌లో రజక సంఘం సభ్యులకు కమ్యూనిట్ హాల్ నిర్మాణం కోసం రూ.2.50 లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, వైస్‌ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, వెంకట్‌రావు, శైలజ ఉన్నారు.

చదువుతోనే గౌరవం

లోకేశ్వరం: సమాజంలో చదువుతోనే గౌరవం ,గుర్తింపు సాధ్యమని.. విద్యార్థులు చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని పోట్‌పల్లి(బి) గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన తండ్రి గంగారం జ్ఞాపకార్థం 35 మంది విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, బుక్‌లు పంపిణీ చేశారు. ఎంఈవో చంద్రకాంత్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జె.రాజారం, సర్పంచ్ రేఖాబాయి, ప్రధానోపాధ్యాయుడు గంగాప్రసాద్, స్వాతి, కార్యదర్శి శ్రీకాంత్, ఎఫ్ఏ భూమేశ్, భూమాగౌడ్ తదితరులున్నారు.

భగీరథ సిబ్బందికి విధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్: మండలంలోని మాడేగాం భగీరథ వాటర్ ట్రీట్ ప్లాంట్ ఆవరణలో మంగళవారం నూతనంగా చేరిన భగీరథ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇటీవల 43 మంది వీఆర్‌ఏలను ప్రభుత్వం భగీరథశాఖకు కేటాయించడంతో వారంతా విధుల్లో చేరారు. ఈనేపథ్యంలో వారు నిర్వర్తించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భగీరథ సీఈ జ్ఞాన్‌కుమార్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈఈ అంజన్‌కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

నిర్మల్‌ఖిల్లా: ఉత్తమసేవలకు గాను ఉపాధ్యాయ పురస్కారాలను పొందిన ఉపాధ్యాయులను మంగళవారం నిర్మల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. సి.జనార్దన్ (కంకెట), కె.సుదర్శన్ (సాంగ్వి), కె.హంసలత(పీచర), దేవిప్రియ (అక్కాపూర్), వ్యాయామ ఉపాధ్యాయురాలు వెన్నెల(కడ్తాల్)ను ఉత్తమ సేవలకు గాను సన్మానించినట్లు నిర్మల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు నల్ల పురుషోత్తంరెడ్డి, రీజియన్ చైర్మన్ నవీద్ నూరాని, జిల్లా చైర్మన్ కాలగిరి గంగారెడ్డి అన్నారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు నేరెళ్ల హనుమంతు, మూర్తి ప్రభాకర్, సాయి బాపురెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, మురళీధర్, శంకర్రావు, గంగారెడ్డి, అనంతస్వామి పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

తానూరు: మండలంలోని ఆయా పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం ఓటరు నమోదుపై గ్రామసభలు నిర్వహించాలని తహసీల్దార్ లింగంమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌వోలు, కార్యదర్శులు సమావేశం నిర్వహించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు.

డ్రెయినేజీ పరిశీలన

నిర్మల్‌టౌన్: పట్టణంలోని భాగ్యనగర్‌లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మంగళవారం పర్యటించారు. డ్రెయినేజీ, రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శానిటేషన్ సిబ్బంది కాలనీలో పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కాలనీవాసులు ఉన్నారు.

లోకేశ్వరంలోని రామకృష్ణ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు





ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూలమాల వేస్తున్న సిబ్బంది



భైంసారూరల్: మిర్జాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విద్యార్థిని

టీచర్లే జాతి నిర్మాతలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్మల్‌లో వశిష్ట ఇంపల్స్ ఈటెక్నో, విజయ పాఠశాలలు, ముధోల్‌లోని అక్షర, లోకేశ్వరంలోని రామకృష్ణ పాఠశాలలో, భైంసాలోని శ్రీగౌతమి, వాసవి, వేదం, అల్ఫోర్స్, నారాయణ, జేఆర్ఎస్ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. టీచర్లే జాతినిర్మాతలని.. మనలోని అజ్ఞానం తొలగించి జ్ఞానం ప్రసాదించేవారే గురువని అన్నారు. మనం ఎదిగితే మనకు చదువు చెప్పిన గురువే ఎక్కువ సంబురపడతారని పేర్కొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సోన్: న్యూవెల్మల్-బొప్పారంలో ఉపాధ్యాయుడికి సన్మానం



లక్ష్మణచాందలో..



తానూరు: ఎల్విలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



కుంటాల ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసంలో మంగళవారం సారంగపూర్ మండలం ధని గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

మంత్రికి ఆహ్వానం..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నాయుడువాడ శ్రీ గుట్ట వీరన్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే గుట్ట వీరాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈమేరకు మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌కు ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మంత్రికి సన్మానం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఓ వివాహానికి హాజరైన మంత్రి ఐకేరెడ్డిని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ కలిశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మంత్రి ఐకేరెడ్డిని శాలువాతో సన్మానించారు. అంతకుముందు పట్టణంలోని జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గంగాధర్, దివాకర్, తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించండి

లోకేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు మంగళవారం లోకేశ్వరం పీహెచ్‌సీలో వైద్యురాలు శైలజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు నందకుమారి మాట్లాడుతూ ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు గోదావరి, సబిత, సుజాత, సునీత, దేవపాల, గంగామణి, అనిత, సవిత, స్వప్న, సాగర, సాయవ్వలు ఉన్నారు.

సారంగపూర్: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆశవర్కర్ల సంఘం నాయకులు శ్యామల, లక్ష్మి, సునీత మాట్లాడారు. ఆయా గ్రామాల ఆశవర్కర్లు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

సమ్మె నోటీసు అందజేత

కుంటాల: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కుంటాలలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై హన్మాండ్లుకు సమ్మె నోటీసు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజ్ చేయడంతోపాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు విజయ, శైలజ, విమల, శ్యామల, ఫర్జానా, గుణసుందరి, కౌసల్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతు సమ్మేళనంలో జిల్లా నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని కల్లెం జంగారెడ్డి గార్డెన్‌లో జరిగిన బీజేపీ రైతు సమ్మేళనం కార్యక్రమంలో మండలానికి చెందిన ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల సమస్యలపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ చర్చించారు. పార్టీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖానాపూర్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ను ఖానాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి నిర్మల్ జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు బూసారపు గంగాధర్, ఉపాధ్యక్షులు భోజన్న, నరేశ్, నవత, రాధిక, ప్రధాన కార్యదర్శులు రత్నం , అలేఖ్య, రాము, గజేందర్ తదితరులు ఉన్నారు.

వీడ్కోలు

భైంసాటౌన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని భైంసా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణ అన్నారు. కోర్టులో హోంగార్డుగా విధులు నిర్వహించిన మల్లారెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో మంగళవారం కోర్టు సిబ్బందితో కలిసి ఆయన్ను సన్మానించి వీడ్కోలు పలికారు.

కోదండరాం పుట్టినరోజు వేడుకలు

భైంసాటౌన్:టీజేఎస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరాం, తదితరులు కేక్ కట్ చేశారు. టీజేఎస్ నాయకులు రాజు, శ్రీనివాస్, కుర్మిద్, షేక్ అలీం, లతీఫ్, మీనాజ్, కరీం పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ డి.స్రవంతి, ప్రిన్సిపాల్ శంకర్, సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

మామడ: మండలంలోని బూరుగుపల్లి శివాలయంలో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రాంనాథ్ కుటుంబంతో కలిసి పూజలు చేశారు.

కంటి పరీక్షలు

ఖానాపూర్: పట్టణంలో ఆదిత్య ఐ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు సన్నిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆదిత్య ఐ కేర్ ఆధ్వర్యంలో 108మందికి పరీక్షలు చేసి పలువురిని ఆపరేషన్ నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

మట్టి సేకరించిన బీజేపీ నాయకులు

కుంటాల: మండలంలోని కల్లూర్, లింబా(బి) గ్రామాల్లో మంగళవారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, లక్ష్మణ్ పటేల్, వెంకన్న, దత్తు, నవీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

కుంటాల: మండల కేంద్రంలోని సృజన విద్యానిలయం పాఠశాలలో మంగళవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

- జిల్లాలో 176 మంది ఎంపిక
- నిర్మల్‌లో ప్రశంసాపత్రాలు అందించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకునే ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. జిల్లా నుంచి 176 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి మంగళవారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జిల్లా కేంద్రంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో పురస్కారాలు అందజేశారు.

పీజీ హెచ్‌ఎం విభాగంలో..

పి.విద్యాధర్ (జెడ్పీఎస్ఎస్, మిర్జాపూర్), డి.ధర్మేంద్ర (జెడ్పీఎస్ఎస్, బాబాపూర్), ఎం.ఏ షఫీం(జెడ్పీఎస్ఎస్ పార్‌పెల్లి), పి.వెంకటేశ్వర్ (జెడ్పీఎస్ఎస్ కౌట్లబి), విశ్వనాథ్ (జెడ్పీ ఎస్ఎస్ బోరిగాం), హెచ్.మల్లయ్య (జెడ్పీఎస్ఎస్ పాతఎల్లాపూర్), సురేందర్‌రెడ్డి(జెడ్పీఎస్ఎస్ అబ్దుల్లాపూర్), జి.నర్సయ్య (జెడ్పీఎస్ఎస్ కుంటాల), గోవిందరాజులు (జెడ్పీఎస్ఎస్ కౌటా), సుచిత్ర (జెడ్పీఎస్ఎస్ మందపల్లి), పద్మాకర్ (జెడ్పీఎస్ఎస్ ప్రియదర్శినినగర్), వి.శ్రీనివాస్ (జెడ్పీఎస్ఎస్ సత్తెనపల్లి), ఆర్.సురేశ్ (జెడ్పీఎస్ఎస్ నిగ్వా), ఎ.ఈశ్వర్ (జెడ్పీఎస్ఎస్ దస్తురాబాద్).

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో..

గడిపల్లి లక్ష్మణ్ (ఎంపీపీఎస్ రామ్‌టెక్), పి.నగేశ్ (ఎంపీపీఎస్ మన్మద్), ఎం.గంగాధర్(ఎంపీపీఎస్ ధని), బి.రాజేశ్వర్(ఎంపీపీఎస్ పోతారం), డి.శివాజీ (ఎంపీయూపీఎస్ జావల), బిడి సుధాకర్(జెడ్పీఎస్ఎస్ పెంబి), అజార్ అలీ(జెడ్పీఎస్ఎస్ మదీనా కాలనీ), జె.రవీందర్ (జెడ్పీహెచ్ఎస్ కడెం), సర్దార్ మొహినుద్దీన్(జెడ్పీఎస్ఎస్ ఈద్‌గాం), ఆర్.రాజేశ్వర్ (జెడ్పీఎస్ఎస్ ముజిగి), డి.గణపతి(జెడ్పీఎస్ఎస్ బన్సపల్లి), టి.నారాయణ (జెడ్పీఎస్ఎస్ పాక్‌పట్ల), జోహార్ ప్రవీణ్ (జెడ్పీఎస్ఎస్ ఆసరా కాలనీ), మనోహర్‌రెడ్డి (జెడ్పీఎస్ఎస్ సోమవార్‌పేట్), గంగాకిషన్ (జెడ్పీఎస్ఎస్ కౌట), రతన్‌కుమార్ (జెడ్పీఎస్ఎస్ దేగాం), కృష్ణకిషోర్(జెడ్పీఎస్ఎస్ కొర్టికల్), రాజేశ్వర్(జెడ్పీఎస్ఎస్ న్యూవెల్మల్), బట్టు గంగాధర్(జెడ్పీఎస్ఎస్ లక్ష్మణచాంద), లతాంబరరావు(జెడ్పీఎస్ఎస్ బన్సపల్లి), రమాదేవి (జెడ్పీఎస్ఎస్ మామడ), రత్నకుమార్(జెడ్పీఎస్ఎస్ ముధోల్), గంగాధర్,(జెడ్పీఎస్ఎస్ ధోనిల్లి), విజయభాస్కర్ (జెడ్పీఎస్ఎస్ లక్ష్మణచాంద), మాధవి(జెడ్పీఎస్ఎస్ కొరిటికల్), మల్లేశ్(జెడ్పీఎస్ఎస్ మున్యాల్), నస్రత్ భాను (జెడ్పీఎస్ఎస్ కిసాన్‌గల్లీ), రవికుమార్ (జెడ్పీఎస్ఎస్ పారేపల్లి), దత్తురాం(జెడ్పీఎస్ఎస్ జుమ్మారాత్‌పేట్), ముర్తుజా అలీ (జెడ్పీఎస్ఎస్ ముధోల్), ఫరీదా తస్లీమ్ (జెడ్పీఎస్ఎస్ సోమవార్‌పేట్), లక్ష్మీప్రసాద్‌రెడ్డి (ఎంపీయూపీఎస్ అక్కాపూర్), అంబాజీ(జెడ్పీఎస్ఎస్ మంజులాపూర్), రవీందర్ గౌడ్ (జెడ్పీఎస్ఎస్ సోన్), వెంకటరమణ(జెడ్పీఎస్ఎస్ వడ్యాల్), అన్నపూర్ణ(జెడ్పీఎస్ఎస్ చించోలిబి), సుధాకర్ (జెడ్పీఎస్ఎస్ బోసి), రమణారావు (జెడ్పీఎస్ఎస్ నర్సాపూర్(జి)), సాగర్‌రెడ్డి (జెడ్పీఎస్ఎస్ జామ్), అజ్గర్‌అలీ(జెడ్పీఎస్ఎస్ బాసర), సయ్యద్‌అలీ (జెడ్పీఎస్ఎస్ కస్బ), రాజేందర్(జెడ్పీఎస్ఎస్ సత్తెనపల్లి), నాగభూషణం(జెడ్పీఎస్ఎస్ దిలావర్పూర్), వినాయక్‌రెడ్డి(జెడ్పీఎస్ఎస్ తిమ్మాపూర్), నారాయణ(జెడ్పీఎస్ఎస్ రాజుర), నర్సవ్వ (జెడ్పీఎస్ఎస్ రత్నాపూర్ కాలనీ), పోశెట్టి(జెడ్పీఎస్ఎస్ సారంగాపూర్), రాఘవేందర్ (జెడ్పీఎస్ఎస్ బెల్గాం), దేవేందర్ (జెడ్పీఎస్ఎస్ మన్మద్), వెంకటేశ్వరరావు(జెడ్పీఎస్ఎస్ కస్బా), సాజియా ఎస్మీన్(ఎంపీయూపీఎస్ కడెం), వేణుమాధవ్(జెడ్పీఎస్ఎస్ కర్తాల్), ఫయాజ్ (జెడ్పీఎస్ఎస్ బీరవెల్లి), నయీమ్(జెడ్పీఎస్ఎస్ ఓలా), చంద్రయ్య (జెడ్పీఎస్ఎస్ మామడ), సుహాసిని(జెడ్పీఎస్ఎస్ వెంగాపేట్), హేమలత(జెడ్పీఎస్ఎస్ ఖానాపూర్), ఆంజనేయులు (జెడ్పీఎస్ఎస్ జామ్), ఫర్హానా (జెడ్పీఎస్ఎస్ మామడ), అజీజ్‌ఖాన్ (జెడ్పీఎస్ఎస్ మదీనాకాలనీ), మధుసూదన్ (జెడ్పీఎస్ఎస్ చామన్‌పల్లి), దేవిదాస్(జెడ్పీఎస్ఎస్ రాయపూర్‌కాలనీ), షమీం (జెడ్పీఎస్ఎస్ జుమ్మారాత్‌పేట్), వై.సాయన్న(జెడ్పీఎస్ఎస్ మస్కాపూర్), మూస సుభాష్ (జెడ్పీఎస్ఎస్ స్వర్ణ), పి.గంగారాం (జెడ్పీఎస్ఎస్ గడ్చాంద), రామారెడ్డి (జెడ్పీఎస్ఎస్ ఆసరా కాలనీ), దాసరి సాయన్న(జెడ్పీఎస్ఎస్ కుబీర్), మోషన్ ఫాతిమా (జెడ్పీఎస్ఎస్ ప్రియదర్శినినగర్), సయ్యదా (జెడ్పీఎస్ఎస్ కస్బ).

లాంగ్వేజ్ పండితులు

తెలుగులో..కడారి దశరథ్(జెడ్పీఎస్ఎస్ మిర్జాపూర్), నర్సయ్య(జెడ్పీఎస్ఎస్ పానకల్)

హిందీలో.. సూర్యకాంత్ (జెడ్పీఎస్ఎస్‌కొలూరు), కె.శ్రీనివాస్(జెడ్పీఎస్ఎస్ మస్కాపూర్), అబ్దుల్ (జెడ్పీఎస్ఎస్ పానకల్), నారాయణ (జెడ్పీఎస్ఎస్ కస్బ)

పీఈటీల విభాగంలో..

జమున (పీఈటీ ముజిగి), నచ్చేందర్‌రెడ్డి పీఈటీ పునకల్) దేవిడ్ (పీఈటీ తిమ్మాపూర్).

పురస్కారాలు పొందిన ఎస్జీటీలు..

బి.కష్టవేణి(ఎంపీపీఎస్ సోన్), ఎస్.అరుణ (ఎంపీపీఎస్ కడెం), శ్రీనివాస్(ఎంపీపీఎస్ లింగాపూర్), నర్సయ్య (ఎంపీపీఎస్ కదిలి), వాయిద్‌ఖాన్(ఎంపీపీఎస్ ముజిగి), విష్ణుప్రియాంక(ఎంపీపీఎస్ సేవాలాల్‌తండా), దేవిప్రియ(ఎంపీపీఎస్ అక్కాపూర్)సు సరళ (ఎంపీపీఎస్ జాఫర్‌పూర్), పుష్పలత (ఎంపీపీఎస్ కుంటాల), రామునాయక్(ఎంపీపీఎస్ పెంబి), సాయన్న (ఎంపీపీఎస్ లింబాకే), రాజేశ్వర్ (ఎంపీపీఎస్ అనంతపూర్), సంజీవ్ (ఎంపీపీఎస్ చోడి), భోజారాం(ఎంపీపీఎస్ బోంద్రి), ఆర్.శ్రీధర్(ఎంపీపీఎస్ ఓని), కృష్ణ (ఎంపీపీఎస్ చింతల్‌బోరి), అమృతం(ఎంపీపీఎస్ కల్లూరు), సదానందం(ఎంపీపీఎస్ తిమ్మాపూర్), మహిజాబీన్ (ఎంపీపీఎస్ నర్సాపూర్), జి.లక్ష్మన్న(ఎంపీపీఎస్ తోరాటి), ప్రభాకర్(ఎంపీపీఎస్ పుస్పూర్), వినోద్‌రాజ్ (ఎంపీపీఎస్ దిలావర్‌పూర్‌తండా), మల్లారెడ్డి (ఎంపీపీఎస్ వితోడితండా), రమాదేవి (యూపీఎస్ వైకుంఠాపూర్), చిత్రలేఖ(జెడ్పీఎస్ఎస్ సోమవార్‌పేట్), నరసింహస్వామి (ఎంపీపీఎస్ కొట్ల కె), హంసలత (ఎంపీపీఎస్ పీచర), రాజన్న (ఎంపీపీఎస్, అంకెన), నరేందర్ (ఎంపీపీఎస్ సుర్జాపూర్), రాజేందర్ (ఎంపీపీఎస్ ముక్తాపూర్), అనిత (ఎంపీపీఎస్ పెంద్‌పల్లి), సంజన (ఎంపీపీఎస్ కామోల్), రాధిక (ఎంపీపీఎస్ గుండెగాం), శిరీష (ఎంపీపీఎస్ ఆకొండపేట్), లావణ్య(ఎంపీపీఎస్ పాండవపూర్), మురళీధర్ (ఎంపీపీఎస్ మస్కాపూర్), సులేమాన్ (ఎంపీపీఎస్ ఖానాపూర్), గంగాధర్(ఎంపీపీఎస్ సత్తెనపల్లి), బూస్లే శివకుమార్ (ఎంపీపీఎస్ హల్దా), గోవర్ధన్‌రావు (ఎంపీపీఎస్ చామన్‌పెల్లి), రమేశ్(ఎంపీపీఎస్ కనకాపూర్), ఆనంద్(ఎంపీపీఎస్ రాంనగర్), రమేశ్ (ఎంపీపీఎస్ వితోలి), షకీల్(పీఎస్ ఆసరా కాలనీ), అఫ్రోజ్(ఎంపీపీఎస్ వాగులవాడ), రాజన్న (పీఎస్, కురన్నపేట్), మంగళారపు సుధాకర్ (ఎంపీపీఎస్ ముఠాపూర్), వి.రాజేశ్వర్(ఎంపీపీఎస్ మదనపల్లి), భూమన్న(ఎంపీపీఎస్ సోనాలి), రాజేశ్వర్ (ఎంపీపీఎస్ బెల్గాం), బాపు (ఎంపీపీఎస్ గాజులపేట్), సోమేశ్వర్ (ఎంపీపీఎస్ రాజాపూర్), మారన్న (ఎంపీపీఎస్ సీలాయిపేట్), సాయన్న (ఎంపీపీఎస్ న్యూపోచంపాడు), శ్రీరాములు(ఎంపీపీఎస్ ఖానాపూర్), నాగభూషణం (ఎంపీపీఎస్), వి.సుప్రియ(ఎంపీపీఎస్ చెరువు ముందుతండా మామడ), శివప్రసాద్ (ఎంపీపీఎస్ అడెల్లి), పోశెట్టి (ఎంపీపీఎస్ అంకెన), లక్ష్మణ్ (ఎంపీపీఎస్ సుంకిలి), గట్టు శ్రీనివాస్(ఎంపీపీఎస్‌శాంతినగర్), రాజేశ్వర్ (ఎంపీపీఎస్ మందపల్లి), సలీం (ఎంపీపీఎస్ ఆసరా కాలనీ), మురళి(ఎంపీపీఎస్ సంఘంపేట్), జయలత (ఎంపీపీఎస్ సత్తెనపల్లి).

వెల్ఫేర్ పాఠశాలల విభాగంలో..

అంబారావు (భైంసా బాలికల ఆశ్రమ పాఠశాల), వనజ(టీఎస్ఆర్ఎస్ సోఫీనగర్), ప్రవీణ్ కుమార్(టీఎస్ మోడల్ స్కూల్ కుంటాల), ప్రేమలత(లెఫ్ట్ పోచంపాడు), శోభ ఆనంద్(నచ్చన్‌ఎల్లాపూర్ టీజీటీ), రాజేశ్వరి (టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జామ్), జాదవ్ బలిరాం(ఎస్ఏ హిందీ, భైంసా బాలికల ఆశ్రమ పాఠశాల), శ్రీలత(ఎస్ఏ ఫిజికల్‌సైన్సు ఖానాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల), శ్రావణ్(భైంసా, ఎస్టీజీ), బలిరాం (భైంసా), రాజన్న (ఆశ్రమ పాఠశాల ముధోల్), భూక్య ప్రమీల(కేజీబీవీ కడెం), నవిత (కేజీబీవీ లక్ష్మణచాంద), స్వప్న (కేజీబీవీ జామ్), అనిల్‌కుమార్ (ఎంజేపీ ఖానాపూర్), సాయినాథ్(టీఆర్ఎస్ భైంసా), సహనాజ్ బేగం (టీఎంఆర్ఎస్ ఖానాపూర్).

'వడ్డెరబంధు' ప్రకటించాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: వడ్డెర కులస్తులు ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం 'వడ్డెరబంధు'ప్రకటించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 1977 కంటే ముందు డీనోటిఫైడ్ ట్రైబ్స్ జాబితాలో వడ్డెరలు ఉన్నారని.. తర్వాత ప్రభుత్వం బీసీ జాబితాలో కలిపి తీరని అన్యాయం చేసిందన్నారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వల్లేపు పుణ్యం, పసుపుల యాదగిరి, పసుపుల పురుషోత్తం, సాయికృష్ణ, పసుపుల రాంబాబు, రాము, రమేశ్, తిరుమలయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ బృందానికి సహకరించాలి

లోకేశ్వరం: మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తారని.. బృందం సభ్యులకు అందరూ సహకరించాలని ఎస్సార్పీ తిరుపతి అన్నారు. మంగళవారం లోకేశ్వరం రైతువేదికలో డీఆర్పీలు, గ్రామ కార్యదర్శులకు, ఉపాధిహామీ టీఏ, ఏఫ్ఏలకు నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. 1జూలై 2021 నుంచి 31మార్చి2023 వరకు 21 నెలల్లో ఉపాధి పనుల కోసం రూ.ఏడు కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు మంజుల, శారద, రవీందర్, హారిక ఉన్నారు.

వరిలో 3జీ గుళికలు చల్లుకోవాలి

సోన్: వరి నాటు వేసిన 40 రోజుల్లోగా పొలంలో 3జీ గుళికలు చల్లుకుంటే మొగి, కాండం తొలిచే పురుగు, చీడపీడలు రాకుండా ఉంటాయని ఏఈవో అంబాజీ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూబొప్పారంలో ఏఈవో క్షేత్రస్థాయిలో పర్యటించి మాట్లాడారు. ఈ గుళికలతో భూమిలో సూక్ష్మ,స్థూల పోషకాలు మొక్కలకు అంది అధికంగా పిలకలు వస్తాయన్నారు. వరిలో అగ్గితెగులు నివారణకు 120 గ్రాముల ట్రై సైకలాజోల్‌సురాకు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గంగాధర్, పరమేశ్వర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.